# సావేరి

-ఎం.వెంకటేశ్వరరావు

ఇంటిముందు కారాగిన శబ్దానికి లోపలి నుంచి బాగా బలిసిన జెర్మన్ షెఫర్డ్ కుక్క గుర్రుమంటూ పెద్దగా అరుస్తూ పరిగెత్తుకొస్తూంటే ఇవ్వాళ నా పనైపోయిందనుకుని హడలిపోయాను. గట్టిగా కళ్లు మూసుకుని నిలబడ్డాను. ఆశ్చర్యం. ఎవరో స్టాఫ్ చెప్పినట్టు అది ఆ ఇంటిముందు లాన్ దాటకుండా అరుస్తోంది గానీ ఒక్క అంగుళం కూడా ముందుకు రావడంలేదు.

మెల్లగా కళ్లు తెరిచి చూశాను. ఊహూఁ...దాని పొజిషన్లో మార్పులేదు. ఎవరైనా ఉన్నారేమో అని చుట్టూ చూశాను. ఎవ్వరూ కన్పించలేదు. దాన్ని దాటి లోపలికెళ్లే ధైర్యం లేక సెల్‌ఫోన్లో సావేరిని కాంటాక్ట్ చేశాను. రెండేళ్ల తర్వాత నన్ను చూసిన సావేరి గబగబా బయటికొచ్చి "గాయత్రీ!" అంది ఆశ్చర్యంగా.

"త్వరగా రావే తల్లీ! ఈకుక్క నన్ను లోపలికి రానిచ్చేట్టు లేదు"

"స్నూపీ! గో ఇన్‌సైడ్" సావేరి గొంతు వినగానే తోకాడించుకుంటూ వెళ్లిందది.

సావేరి దాన్ని గొలుసుతో కట్టేసి నా దగ్గరికొచ్చి "గాయత్రీ! రావే!" అంది నన్ను హత్తుకుని "ఎన్నాళ్లయ్యిందే?" అంటూ లోపలికి తీసుకెళ్లింది.

లివింగ్‌రూంలోకి వెళ్లగానే ఖరీదైన కార్పెట్, ఖరీదైన వాల్ పెయింటింగ్స్, ఫర్నిచర్ చూడగానే సావేరి అమెరికా వైభవం అర్థమయింది.

"ఇవ్వాళ మా ఆయన, వాళ్లమ్మ లివర్‌మూర్ గుడికెళ్లారు. అందుకే నీకిలా ఒంటరిగా దొరికాను" అని నా పక్కన వచ్చి కూచున్న సావేరి మొహాన్ని దగ్గరగా పరిశీలించాను.

పంకజం మామ్మ చెప్పింది నిజమే. సావేరి కళ్లల్లో వెనకటి కాంతి లేదు. ఎందుకో డల్‌గా ఉన్నట్టు అన్పించింది.

కాఫీ తాగుతూ కబుర్లు చెప్పుకుంటూ ఉంటే సావేరి తెగ సంబరపడిపోయింది. రెండుగంటల పాటు ఎల్‌కేజీ నుండి ఎంసియే వరకూ బాల్యస్మృతుల్ని గుర్తుచేసుకున్నాం.

మధ్యాహ్నం అన్నం తింటూ "నువ్విక్కడ సంతోషంగా ఉన్నావా?" అనడిగాను.

ఎదురుచూడని ప్రశ్నకు ఆశ్చర్యంగా నా మొహంలోకి చూస్తూ "సంతోషమంటే ఏమిటే? ఖరీదైన బట్టలు, ఇంద్రభవనంలాంటి ఇల్లు, ఖరీదైన కార్లూ, ఖరీదైన మనుషుల మధ్య తిరుగుతూ రాత్రికి ఖరీదైన పరుపుల మీద నిద్రించడమే సంతోషం అయితే నేను నా జీవితాన్ని ఊహించిన దానికన్నా ఎక్కువ సంతోషంగానే ఉన్నాను" అంది ఉద్వేగంగా. అలా అంటున్నప్పుడు సావేరి మొహం ఎర్రబడ్డా కళ్ళు మాత్రం రెండు కన్నీటిచుక్కల్ని రాల్చాయి.

"ఇప్పుడు పాడడం పూర్తిగా మానేశావా?"

"హుఁ.." అని దీర్ఘంగా నిట్టూర్చి గోడమూలనున్న స్టాండు మీద అలంకారప్రాయంగా ఉంచిన తంబూర వైపు నిరాసక్తిగా చూస్తుంటే-

"చెప్పవే. పాటనే ప్రాణంగా భావించే నువ్వు ఎందుకిలా పాడడం నిలిపేశావు"

"పెళ్ళయిన నెలరోజులకే రవీంద్రతో అమెరికా బయల్దేరాల్సి వచ్చింది. ఫ్లైట్లోనే చెప్పాను. "రవీ! నాకు పాటంటే ప్రాణం. మానాన్న ఎంతో ఇష్టపడి నాకు సంగీతం నేర్పించారు. తీరా నేను బాగా పాడడం వరకూ వచ్చేసరికి ఆయనకి హార్ట్ ఎటాక్ వచ్చి పోయారు. ఎంతో కష్టపడి, ఇష్టపడి నేర్చుకున్న విద్యకి సార్థకత ఉండాలని నా కోరిక. నా పాటల ఆల్బం తయారుచెయ్యడానికి ఓ ఆడియో సంస్థతో ఒప్పందం కుదిరింది. నా సంగీతం ముందుకు సాగాలంటే మీ సహకారం కావాలి"

"సావేరీ! నువ్వింతగా చెప్పక్కర్లేదు. నీకంటే ముందు నీ పాటకి అభిమానిని నేను. ఇక్కడ సోనీ మ్యూజిక్ కంపెనీలో నాకో ఫ్రెండున్నాడు. అతన్ని కలుద్దాం. నీ సంగీతానికి ఎటువంటి అవరోధం ఏర్పడకుండా చూసే బాధ్యత నాది" అన్నాడు.

అతని మాటలకి స్పందిస్తూ "థ్యాంక్స్" అన్నాను అతని భుజం మీద తలవాల్చి.

★ ★ ★

వర్జీనియా వచ్చాక మొదటి శనివారం నన్ను లివర్‌మూర్ టెంపుల్‌కి తీసుకెళ్ళాడు రవీంద్ర. అక్కడ పరిచయమైన పూజారి శర్మగారు-

"అమ్మా! పోయిన సంవత్సరం ఆంధ్రా వెళ్లినప్పుడు టీవీలో మీ ప్రోగ్రాం చూశాను. చాలా బాగుంది. మీరిక్కడే ఉండేట్టయితే మహాశివరాత్రికి మీరు పాటకచ్చేరి చేస్తే బావుంటుంది" అన్నారు.

ప్రోగ్రాం రోజు సిద్ధమై బయల్దేరబోతుంటే మా అత్తగారికి అస్వస్థత. దగ్గర్లో ఉన్న హాస్పిటల్‌కి తీసుకెళ్లాం. ఆరోజంతా ఆస్పత్రిలో అన్ని టెస్టులూ చేయించాం. ఏమీ లేదని తెలిశాక రవీంద్ర నేను ఊపిరి పీల్చుకున్నాం. అప్పటికే ప్రోగ్రాంకి ఇచ్చిన టైమై పోవడంతో కాన్సిల్ అయింది.

★ ★ ★

రెండునెలలయ్యాక ఓ రోజు రవీంద్ర సోనీకంపెనీలో పనిచేస్తున్న ఫ్రెండుని ఆయనతో బాటు ఇండియా నుండి వచ్చిన మ్యూజిక్ డైరెక్టర్ శ్రీహర్షని ఇంటికి తీసుకొచ్చాడు.

పరస్పర పరిచయాలు అయ్యాక,

"సావేరి గారూ! అన్నమయ్య కీర్తనలతో ఓ ఆల్బం చేద్దామనుకుంటున్నాను. అన్ని పాటలూ మీరే పాడాలి. మీకిష్టమైతే అగ్రిమెంట్ చేద్దాం" అన్నాడు శ్రీహర్ష.

అవకాశం మరోసారి ఇంటికొచ్చి తలుపుతట్టేసరికి నేనూ, రవీంద్ర సంతోషంగా అంగీకరించాం.

"అయితే వచ్చేనెలలో రికార్డింగ్‌కెళ్దాం" అని చెప్పి వెళ్లాడు శ్రీహర్ష. మొదటిసారి ఎదురైన అపశకునం, రెండోసారి శుభప్రదం కావాలని దేవుణ్ణి వేడుకున్నాను.

★ ★ ★

"సావేరీ! త్వరగా తయారవ్వు. మరో గంటలో మా ఫ్రెండింట్లో పార్టీకెళ్లాలి" ఇంటికొస్తూనే

తొందరపెట్టాడు రవీంద్ర.

ఆరోజు పార్టీలో డాక్టర్ నవనీత కృష్ణగారిని మాకు పరిచయం చేశాడు రవీంద్ర స్నేహితుడు. అమెరికాలో ఆయన ప్రముఖ కార్డియాలజిస్టు అని తెల్సు. పరిచయమయ్యాక ఆయన తానా అధ్యక్షు లని తెలిసింది.

"సావేరి గారూ! మీ గురించి విన్నాను. ఈసారి తానా సభల్లో మీ పాట కచ్చేరి ఉంటుంది. ముందే చెబుతున్నాను. డేట్, టైం త్వరలోనే తెలియజే స్తాను" అని నవనీతకృష్ణ గారు చెప్పారు.

ఇంటికొచ్చాక ఆ విషయం రవీంద్ర వాళ్ల మ్మతో చెబుతుంటే...

"నాకు తలనొప్పిగా ఉందిరా! తర్వాత వింటాను" అనెళ్లి పడుకుంది, ఆ ఆనందాన్ని పంచుకోవడం ఇష్టం లేనట్టు.

ఆమె తరహా అంతే అనుకున్నాను.

★ ★ ★


పదిహేన్రోజుల తర్వాత శ్రీహర్ష వచ్చి ఆల్బంలో నేను పాడబోయే పాటల లిరిక్స్, ట్యూన్స్ కంపోజ్ చేసిన సీడీ ఇచ్చి అడ్వాన్స్ చెక్ ఇస్తూ- "వచ్చేవారం రికార్డింగ్‌కి వెళ్దాం మేడం" అని చెప్పి వెళ్లాడు.

సరిగ్గా రికార్డింగ్‌కి మూడ్రోజుల ముందు అత్తగారు జ్వరం, తలనొప్పి అని పడు కుంది. నేను నా గదిలో పాటలు ప్రాక్టీస్ చేస్తుంటే.-

"అబ్బబ్బ! సావేరీ కాస్త మెల్లగా పాడుకో, తలపోటు పుడుతోంది" అంది. అంతే మనస్సు చివుక్కు మన్పించి ఆపుచేశాను.

మరుసటిరోజు ఉదయం లేచి పాట ప్రాక్టీస్ చేస్తున్నా అదే సమస్య. రవీంద్ర వాళ్ళమ్మకి వంత పాడేసరికి పాట గొంతునొక్కి పక్కగదిలోకెళ్లాను.

ఆరోజు సాయంత్రానికి అత్తగారు గుండెనొ



ప్పంటూ హడావిడి చేయడంతో హాస్పిటల్‌లో అడ్మిట్ చెయ్యాల్సి వచ్చింది.

అక్కడ ఆవిడ నాతో "నువ్వెందుకు ఇక్కడ సావేరీ! వెళ్లి పాట ప్రాక్టీస్ చేసుకో" అంది వ్యంగ్యంగా.

నిజమేననుకుని వెళ్లబోతుంటే "సావేరీ! నాకు లీవు లేదు. ఈరోజుకి నువ్విక్కడే ఉండు" అన్నాడు రవీంద్ర.

"నా అనారోగ్యం ఎప్పుడూ ఉండేదే అని ఈపాటికి సావేరికి అర్ధమయి ఉంటుంది. నువ్వె ళ్ళమ్మా" అనామె కొడుకుతో అంటుంటే వ్యంగ్యం మైకులో మ్రోగుతున్నట్టు అన్పించింది.

"అలా అన్నమయ్య కీర్తనలకి ఆదిలోనే హంస పాదెదురైంది" అంది సావేరి నిర్లిప్తంగా.

"చాలా పెక్యూలియర్‌గా ఉండే మీ అత్త" అన్నాన్నేను.

"ఇంకో ఇంట్రస్టింగ్ విషయం చెప్తా విను. తానా సభలకి ఆహ్వానం వచ్చింది. మాకు దగ్గర్లో ఉంటున్న సీతాకాంత్ ఫ్యామిలీ, మేమూ ముందు రోజే వెళ్లాలని నిర్ణయించుకున్నాం. ఆరోజు షాపిం గ్‌కి వెళ్లి తిరిగొచ్చేసరికి శోకాలు పెడ్తున్న అత్తగా రిని చూసి ఇద్దరం షాకయ్యాం"

"ఏమయిందమ్మా!" రవీంద్ర కంగారుగా అడి గాడు.

విజయవాడలో ఉంటున్న తన చిన్నాన్న గుండెపోటుతో మరణించాడని ఫోనొచ్చిందని ఏడుస్తూ కూచున్న ఆవిణ్ణి వదిలి అడుగు బయటపెట్టడానికి రవీంద్ర ఒప్పుకో లేదు. అంతటితో ఆగక తానాలో ఏర్పాటుచేసిన నా పాట కచ్చేరికి రాలేని కారణాన్ని నవనీతకృష్ణగా రికి ఫోన్ చేసి చెప్తుంటే-"బ్యాడ్ లక్" అని ఆయన ఫోన్ పెట్టే శాడు.

శోకాలు పెడుతున్న తల్లితో "అమ్మా! ఆ విజయవాడ వాళ్ల ఫోన్ నెంబర్ ఇవ్వు ఫోన్ చేద్దాం" అన్నాడు రవీంద్ర.

"అలా అని నీ పెళ్లాం అడగమందా?'' అని ఇంతెత్తున లేచి,

"ఏమ్మా నేనేమైనా అబద్ధం చెబుతున్నానేమోనని రుజువు కోసం అడిగిస్తున్నావా?'' అని నన్ను అడుగుతుంటే అవాక్కయ్యాను.

'నన్ను పాడనివ్వకూడదు అన్నదే అత్తగారి ఆంతర్యం'అని అర్థం చేసుకున్నాను. అదేమాట రవీంద్రతో అంటే..

"ఛ! అలాంటిదేమీ ఉండదు. పొరబడుతున్నావు. ముందు ఆమె ఆరోగ్యం ముఖ్యం. పోనీ కొన్నాళ్ళు ఆమె ఇష్టప్రకారమే..'' అంతే ఆ తర్వాత రవీంద్ర ఏం చెబుతున్నదీ నా చెవులకి విన్పించలేదు.

ఇదే విషయం మా అమ్మకి ఫోన్ చేసి చెబితే...

"పాటేమైనా కూడు పెడ్తుందటే వాళ్లమాట కాదని పిచ్చి వేషాలేసి అక్షయ పాత్రలా అందొచ్చిన జీవితాన్ని అభాసుపాల్జేసుకోకు'' అని ఫోన్ పెట్టేసింది. అంతే! ఆరోజు అలంకారార్థం ఈమూల నిలబడ్డ ఈ తంబూర ఇలా ఒంటరిగానే ఉంది'' అంటున్నప్పుడు సావేరి కళ్లనుండి ధారలుగా దిగుతున్న కన్నీళ్లు చూసి చలించిపోయాను.

సాయంత్రం వరకూ ఉండి బయల్దేరుతుంటే కారు వరకూ వచ్చిన సావేరితో కట్టేసి ఉన్న కుక్కని చూపుతూ..

"సావేరీ! ఈ కుక్క మొదట నన్ను చూడగానే చీల్చి చెండాడేలా పరిగెత్తుకు వచ్చింది. కానీ లాన్ చివరకి రాగానే అడుగుబయటికి పెట్టకుండా ఆగిపోయింది ఎందుకని?'' అన్నాను.

"కుక్క ఇల్లొదిలి వెళ్లకుండా లాన్ చుట్టూ లో ఓల్టేజ్‌తో కరెంట్ వైరు ఏర్పాటుచేశారిక్కడ. అదీ కొద్దిగా షాక్ కొడుతుంది. ఒకటి రెండు సార్లు అలా అయ్యాక మానసికంగా భయానికి అలవాటుపడ్డ కుక్క అక్కడివరకూ వచ్చి ఆగిపోతుంది కానీ బయటికెళ్లదు'' అని చెప్పింది.

★ ★ ★

కార్లో కూచున్న నాకు ఆలోచనలు రివర్స్‌లో వెనక్కొస్తున్నాయి.

సావేరీ నేను బాల్యం నుండి బ్యాచులర్ డిగ్రీ వరకూ ఒకే వీధిలో పక్కపక్క ఇళ్లలో పెరిగాం. సావేరికి గాత్రం దేవుడిచ్చిన వరం. దానిని గుర్తించిన వాళ్ల నాన్నగారు సావేరిని ప్రోత్సహించి మంచి గాయనిగా పేరు తెచ్చుకోవాలని కలలు కనేవారు.

సావేరితో తిరువయ్యూరులో జరిగే త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో పాడించాలని ఆశపడే వారాయన.

అనుకోకుండా ఆయనకి హార్ట్ ఎటాక్ వచ్చి అల్పాయుష్కాలైపోయారు. అయినా సావేరి మాత్రం పట్టుదలతో వాళ్ల నాన్న ఆశయం ప్రకారం ఉదయం ఐదుగంటలకే నిద్రలేచి తంబూర శృతి చేసుకునే శబ్దం మా వీధిలో వాళ్లకి సుప్రభాతంలా విన్పించేది.

నిరంతర సాధనతో ఆమె గాత్రాన్ని కేవలం స్కూలు కచ్చేరిలకే పరిమితం చెయ్యకుండా దేవాలయాల్లో, సభల్లో, రేడియోలో, టీవీల్లో తరచూ విన్పిస్తూ ఉండేది. రవీంద్రభారతిలో సావేరి ప్రోగ్రాం ఇస్తోంది. హంసధ్వని రాగంలో 'వాతాపి గణపతింభజే...'తో మొదలెట్టి గంటన్నర సేపు తన రాగాలాపనతో ఆశీనుల్ని ఆనందపరవశుల్ని చేసి చివరకి శుద్ధసావేరిలో 'కాలహరణమేలరా!' అని పాడుతుంటే..

చెవులకి పట్టిన తుప్పు వదిలినట్టు ఆ సంగీతాంబుధిలో ఓలలాడిన ఎన్నారై రవీంద్ర "ఈ సావేరే నా జీవితభాగస్వామి'' అని కాలహరణం చెయ్యకుండా గట్టి నిర్ణయం తీసుకుని అమలుచేశాడు.

ఇదుగో మళ్ళీ రెండేళ్ళ తర్వాత ఇలా సావేరిని అమెరికాలో కలుసుకుంటానని ఎన్నడూ ఊహించలేదు.

సాఫ్ట్‌వేర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న నేను కంపెనీ పనిమీద అమెరికా రావాల్సి వచ్చింది. అమెరికా రావడానికి రెండురోజుల ముందు మా వీధిలో ఉన్న హనుమని వేడుకుని తిరిగొస్తూ పంకజం మామ్మని చూడడానికి వెళ్ళాను.

ఆవిడ నన్ను పోల్చుకుని సంబరపడ్డది.

"సావేరి ఎలా ఉంది?'' అని అడిగాను. అంతే ఆమె చెప్పిన దాన్ని బట్టి 'సావేరి ఈజ్ నాట్ హేపీ' అని తెలుసుకుని-

"అడ్రస్ కానీ, ఫోన్ నెంబర్ గానీ ఇవ్వు మామ్మా! నేను రెండ్రోజుల్లో అమెరికా వెళ్తున్నాను'' అన్నాను.

ఆ మాటవిని పంకజం మామ్మ గబగబా లోపలికి వెళ్లి గోడకి వ్రేలాడుతున్న పాత క్యాలెండర్ తెచ్చి దాని వెనక సావేరి రాసిన అడ్రస్, ఫోన్ నెంబరు చూపించింది. నోట్ చేసుకున్నాను.


"నువ్వెందుకిలా ఒంటరిగా ఈ పాత ఇంట్లో...'' అనడిగాను.

"సావేరికి పెళ్లయి వెళ్లిపోగానే నా కోడలు సిటీలో అద్దె ఇంటికి పిల్లల చదువుల కోసం వెళ్లింది. కొడుకు కళ్లముందు లేకపోయినా వాడు మిగిల్చిన జ్ఞాప



## ఫ్యాషన్ సుందరి

చూడగానే కైపెక్కించే అందాల తార టబు ఈమధ్యే ఓ బాలీవుడ్ సినిమాలో నటించింది. ఆ చిత్రంలో తరగని అందంతో కనిపించిన టబు తనలో అందం ఏమాత్రం తగ్గలేదని, అవకాశం వస్తే మునుపటి కంటే అందంగా అభినయించగలనని నిరూపించింది. ఇదిలా ఉంటే ఈమధ్య ముంబాయి తదితర ప్రాంతాలలో జరిగే ఫ్యాషన్ షోలలో ఈ సుందరి విరివిగా కనిపిస్తోంది. త్వరలో అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్‌లలో నటించడానికి ప్రయత్నాలు చేస్తోందిట. దీనిలో భాగంగానే తరచూ హైదరాబాద్ చుట్టూ తిరుగుతోందని పుకార్లు వినవస్తున్నాయి.



కాళ్ళి వదులుకోలేక...'' అని కన్నీళ్ళు పెట్టుకుంది.

"నువ్వు దిగులుపడకు మామ్మా! సావేరిని తప్పకుండా కలిసి వస్తాను'' అని చెప్పి బయల్దేరాను.

★ ★ ★

**ఆ తర్వాత ఆరో నెలలో...**

ఇంటి ముందాగిన కారు నుండి దిగిన నన్నూ, సావేరిని చూసిన పంకజం మామ్మ..

"అమ్మా సావేరీ! వచ్చావా తల్లీ! పోయేలోపల నిన్ను చూడాలన్న నా కోరిక గాయత్రి ఇంత తొందరగా తీరుస్తుందనుకోలేదు'' అంది సావేరిని అక్కున చేర్చుకుంది ఆనందభాష్పాల వరదతో.

"మామ్మా! నీకు హార్టెటాక్?!!''ఆశ్చర్యపోతున్న సావేరితో "అవన్నీ తర్వాత చెప్తాగానీ, నువ్వు ముందు లోపలికి పదవే'' అని ఇద్దర్నీ లోపలికి తీసుకొచ్చాను.

★ ★ ★

**ఏడో నెలలో..**

శిల్పకళాతోరణంలో ప్రముఖ ఛారిటబుల్ సంస్థ ఏర్పాటుచేసిన సంగీత విభావరిలో సావేరి రెండేళ్ల తర్వాత మళ్ళీ పాడబోవడం ఆమె అభిమానుల్ని సునాయాసంగా ఆడిటోరియానికి రప్పించగలిగింది.

సావేరి గాత్రానికి ఆడిటోరియం కరతాళధ్వనులతో మార్మోగింది.

ప్రోగ్రాం అయ్యాక నాతో కార్లో వస్తున్న సావేరి ఉద్వేగంగా-

"గాయత్రీ! ఇవ్వాళ నేను పునర్జన్మ ఎత్తినట్టుంది. మా నాన్న నీలో ప్రవేశించి నా పాటకి మళ్లీ ప్రాణం పోసు నిద్రిస్తున్న నన్ను తట్టిలేపినట్టుంది. థ్యాంక్యూ!'' అని కన్నీటితో నాభుజం మీద వాలింది.

"దీనికే సంబరపడిపోతే ఎలా? వచ్చేనెలలో తిరువయ్యూరులో త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో పాడబోతున్నావు. అందాకా ఈ ఆనందభాష్పాలని కాపాడుకో!'' అన్నాను.

అంతే! సావేరి కళ్లు కావేరి ఉప్పెనలయ్యాయి.

★ ★ ★

ఆరోజు రాత్రి సావేరికి అమెరికా నుండి ఫోన్ వచ్చింది. సావేరి బాత్రూంలో ఉండడంతో ఫోన్ నేనందుకున్నాను.

"ఓ! నువ్వా?'' రవీంద్ర గొంతులో వ్యంగ్యం.

"నేను మీతో మాట్లాడాలి'' అన్నాను.

"ఇంకా ఏం మాట్లాడతావు? చేసిందంతా చేసి''

"అదే పొరబడుతున్నారు. సదాశివం లాంటి భర్త బ్యాక్‌బోన్‌గా ఉండడం వల్లనే ఎమ్మెస్ సుబ్బులక్ష్మి చరిత్రపుటల్లో చిరస్మరణీయత పొందింది. సావేరి మీనుండి అంతటి త్యాగాన్ని ఆశించకపోయినా కనీసపు సహకారాన్ని ఆశించింది. మీ అమ్మ సావేరిని పాడనీయకుండా అడ్డుకుంటుంటే మీరు తెలివిగా సావేరిని రెండేళ్ళు మూగదాన్ని చేసి మీ ఇంటి లాన్‌దాటి బయటికి రాలేని స్కూపీలా మార్చారు. చూడండి మనలో లేనిది మన భాగస్వామిలో ఉన్నప్పుడు ప్రోత్సహించాలి. కారణాలు కాలాన్ని హరిస్తాయి.

సావేరి వాళ్ల నాన్నగారు కన్న కల నిజమవ్వడానికి ఇంకా ముప్పయి రోజుల సమయం ఉంది. వచ్చేనెలలో తిరవయ్యూరులో త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో సావేరి పాడబోతోంది. ఇది మీరు తన పక్కనుండాల్సిన సందర్భం. కళని ప్రోత్సహించడం చేతకాని మీలాంటివాళ్లు కళారాధకులమని ముసుగు కప్పుకుంటారు. ఇప్పటికైనా మీరు సావేరికి తగిన భర్తో కాదో ఆలోచించుకోండి'' అని ఫోన్ పెట్టేశాను.

★ ★ ★

**ఎనిమిదో నెలలో...**

తిరువయ్యూరులో అనేకమంది సంగీత దిగ్గజాల మధ్య సావేరి సంగీత సామ్రాజ్యంలోకి అడుగుపెట్టి పంచరత్న కీర్తనలతో త్యాగరాజుకి స్వరార్చన చేస్తుంటే పైలోకాల్లో ఉన్న వాళ్ల నాన్నగారి ఆత్మ ఆనందించిందో లేదో తెలీదు గానీ ఆహూతుల మధ్య రవీంద్రని చూసి నాకు మాత్రం ఆనందంలో కళ్ళు కట్టలు తెంచుకున్న చెరువులయ్యాయి.

★ ★ ★

**తొమ్మిదో నెలలో....**

సావేరి పండంటి మగబిడ్డని ప్రసవించింది.

బారసాల నాడు రవీంద్ర చేత కొడుక్కి 'త్యాగరాజప్రసాద్' అన్న పేరు రాయించింది.

★

## చైనా పిగ్ ఇయర్

చైనాలో 12 సంవత్సరాల సైకిల్‌లో సంవత్సరాలు మారతాయి. ఈ సంవత్సరాన్ని 'పిగ్ ఇయర్' అంటారు. ఈ ఏడు పుట్టిన వాళ్లు నిజాయితీపరులు, ముక్కుకు సూటిగాపోయే వాళ్లు, ఓర్పుగలవాళ్లు, సహనవంతులు, ఇతరులు కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకునేవారు అయి ఉంటారు. వీళ్లు ఎవరి జోలికి పోరు. కుటుంబానికి కట్టుబడి ఉంటారు అని నమ్మకం. ఫిబ్రవరి 18న చైనావారి సంవత్సరాది. 12 సంవత్సరాల క్రితం చైనాలో బాణాసంచాని నిషేధించారు. కానీ ఈ ఏడు నిబంధనలు సడలించిన కారణంగా బీజింగ్, షాంఘైలాంటి నగరాల్లో మన దీపావళి లాగానే చాలా ఆర్భాటంగా బాణాసంచా కాల్చారుట. 1949లో చైనాలో విప్లవం రావడంతో గుళ్లు గోపురాలకు ప్రాధాన్యం పడిపోయింది. మతం మరుగున పడిపోయింది. కానీ ఇప్పటి పాలకుల దృక్పథం మారింది. ప్రజల ఆదాయం కూడా పెరిగింది. నాయకులు పల్లెలదాకా వెళ్లి ప్రజల ఉత్సవాలలో పాలు పంచుకుంటున్నారు.

## బ్రిటన్‌లో తాగుబోతులు

బ్రిటన్‌లో తాగుబోతులు పదేళ్లల్లో మూడురెట్లు పెరిగారుట. కారణం 11-13 సంవత్సరాల పిల్లలు కూడా మద్యానికి బానిసలవుతున్నారట. ఇదొక అంటువ్యాధిలా మారిందని, దీనిని మొదట్లోనే అరికట్టకపోతే ఇదొక సాంఘిక సమస్యగా పరిణమిస్తుందని నిపుణులు అంటున్నారు.

-విమలారామం

